వైఎస్సార్ బీమా.. పేదలకు ధీమా

- ఇంటి పెద్దను కోల్పోయిన ఆపన్నులకు ఆర్థిక భద్రత
- రూపాయి ప్రీమియం వసూలు చేయకుండానే బీమా
- జిల్లాలో మొత్తం 4,53,499 మందికి బీమా సౌకర్యం
- మూడేళ్లలో జిల్లాలో 5,844 మందికి పరిహారం



శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో అరుణకు బీమా నగదు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి శోక సంద్రంలో మునిగిన కుటుంబాలకు నేనున్నా అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని రీతిలో ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. సహజ మరణం, లేదా ప్రమాద వశాత్తు మరణించినా బీమా పరిహారం అందజేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.

కేంద్రం తప్పుకున్నా.. బీమా కంపెనీలు చేతులెత్తేసినా..

గతంలో బీమా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం తనవంతుగా 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సమకూర్చేది. 2020 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం పథకం నుంచి తప్పుకుంది. ఈ క్రమంలో పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం తన భుజాల మీద వేసుకుంది. తాజాగా బీమా కంపెనీలు సైతం చేతులెత్తేశాయి. అయినా, ఖర్చుకు వెనకాడకుండా పరిహారం నేరుగా చెల్లించేలా కార్యాచరణ ప్రారంభించింది.

మూడేళ్లలో రూ.33.56 కోట్లు చెల్లింపు

జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల కాలంలో 5,844 క్లెయిమ్లకు రూ.33.56 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. కాగా, ప్రస్తుతం వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి సర్వే కొనసాగుతోంది. నంద్యాల జిల్లాలో మొత్తం 4,53,499 మందికి బీమా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బీమా వర్తింపు ఇలా..

కుటుంబ పెద్ద సహజ మరణం పొందినా లేదంటే ప్రమాదవశాత్తు మరణించినా పరిహారం పొందేలా పథకాన్ని తీర్చిదిద్దారు. 18 నుంచి 50 ఏళ్ల వ్యక్తి సహజంగా మరణిస్తే.. బాధిత కుటుంబానికి రూ.లక్ష చెల్లిస్తారు. 18 నుంచి 70 ఏళ్ల వయసులో ఉన్నవారు ప్రమాదంలో మరణించినా లేదంటే అంగవైకల్యం సంభవించినా రూ.5లక్షల వరకూ అందిస్తారు. లబ్ధిదారుడి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తారు. బీమా మొత్తం బ్యాంకు అకౌంట్లలో జమ అవుతుంది. క్లెయిమ్ చేసిన 15 రోజుల్లో డబ్బులు వస్తాయి. పేదలు, అసంఘటిత కార్మిక కుటుంబాలపై భారం పడకుండా ప్రభుత్వం బీమా ప్రీమియం ఖర్చు భరిస్తోంది.

అర్హులు ఎవరంటే..

18 ఏళ్లు నిండి 70 ఏళ్లలోపు వయసు ఉండాలి. బీపీఎల్ కుటుంబానికి చెంది ఉండాలి. తప్పనిసరిగా రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబంలో ప్రాథమికంగా సంపాదించే వ్యక్తి అయి ఉండాలి.

భర్త చనిపోయాక అండగా..



నా భర్త గురుమూర్తి ఆచారి యాక్సిడెంట్‌లో చనిపోయారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వైఎస్సార్ బీమాలో నమోదు చేసుకోవడం వల్ల అంత్యక్రియలకు రూ.10వేలు అందజేశారు. తర్వాత నా అకౌంట్‌లో రూ.5లక్షలు జమ చేశారు. దీంతో ఇంటి వద్దనే కుట్టు మిషన్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. బీమా పథకంలో నమోదు చేయించుకోవడం వల్ల ఆర్థికంగా భరోసా లభించింది. బీమా అందజేసిన ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– వడ్ల లక్ష్మిదేవి, దొర్నిపాడు, ఆళ్లగడ్డ

కుటుంబ పెద్ద పేరున పాలసీ



కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండే వ్యక్తి పేరున బీమా పాలసీ తీసుకోవాలి. ఆ వ్యక్తికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ద్వారా అందే సొమ్ము కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. వలంటీర్లు కూడా కుటుంబ పోషకుడి పేరునే పాలసీ ఇవ్వాలి. – శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్‌డీఈ

దొర్నిపాడు: మండలంలో గడప గడపకు నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనరసింహ మంగళవారం పరిశీలించారు. ఎన్నో ఎళ్లుగా సీసీరోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సీసీరోడ్డు పనులు ముమ్మరంగా సాగుతుండటంతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏపీ జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ కొండారెడ్డి, కాంట్రాక్టర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిరాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం పీడీ శ్రీధర్, విద్యార్థులు జుబేద, చందన, సులోచన, వరలక్ష్మి, కావ్య, శ్రీహరి, హర్షవర్ధన్‌లను అభినందించారు. సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

శనగ విత్తనాలు మంజూరు

దొర్నిపాడు: మండలానికి 1,000 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి సునీత మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడతూ క్వింటా శనగ విత్తనాలు రూ.8,100 ఉండగా 40శాతం రాయితీతో రూ.4,860లకు ఇస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు వెంటనే ఆయా రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నెలకొన్న విద్యారంగ, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దక్కా కుమార్, నిరంజన్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, శివ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని 29 మండలాలు తిరిగి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. నంద్యాలలో కొత్తగా ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని డీఆర్‌ఓ పుల్లయ్యకు అందజేశారు. క్యార్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, మధుకిరణ్, అశోక్, ప్రతాప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: పల్లెల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదు అన్నారు. మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లెలో మంగళవారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈఓపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

రుద్రవరం: ఈఓపీఆర్డీగా శ్రీనివాసశర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆళ్లగడ్డ పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఉన్నతాధికారులు రుద్రవరం మండల ఈఓపీఆర్డీగా పదోన్నతి కల్పించారు. దీంతో ఆయన తన నియామక పత్రాలను ఎంపీడీఓ మధుసూదనరెడ్డికి అందజేసి, బాధ్యతలు స్వీకరించారు.

చెంచులక్ష్మి మహాసమాఖ్య సమావేశం

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచుగిరిజన మహిళలకు సంబంధించి ఏర్పాటైన చెంచులక్ష్మి మహాసమాఖ్య జిల్లా సమావేశాన్ని మంగళవారం సున్నిపెంటలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి. రవీంద్రారెడ్డి సమావేశమై పొదుపు సంఘాల వివరాలను తెలుసుకున్నారు. సక్రమంగా నడవని పొదుపు సంఘాలను గాడిన పెట్టాలని వైకెపీ అధికారులను ఆయన ఆదేశించారు. చెంచు గిరిజనులకు ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా ఆధార్ కార్డులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహానంది, అహోబిలం, ఆత్మకూరు, దోర్నాల, మాచర్ల, ఎర్రగొండపాలెం, శ్రీశైలం ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులను కొనాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రోగులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నంద్యాల మండలం చాబోలు గ్రామంలో మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఏడు రకాల వ్యాధులకు సంబంధించి గ్రామంలోని 4,891 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. వారికి అవసరమైన ఆరోగ్య సేవలు జగనన్న ఆరోగ్య వైద్యశిబిరంలో అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర నోడల్ అధికారి రామనాథం మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఈఓఆర్‌డీ మహిదర్‌రెడ్డి, సర్పంచ్ మౌనిక, ఉప సర్పంచ్ హుసేన్‌బాషా, ఎంపీటీసీ దావీద్, కో ఆప్షన్ మెంబర్ పాలబాషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సర్వేలో మలేరియా, డెంగీ టెస్టులు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామనాథ రావు

నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో అనారోగ్య లక్షణాలతో బాధ పడుతున్న వారికి తప్పనిసరిగా మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామనాథ రావు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు మలేరియా, డెంగీ బారిన పడి కోలుకున్న వారి ఆరోగ్య పరిస్థితులను కూడా గమనించాలన్నారు. ఆశ, ఏఎన్‌ఎంలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చూడాలని సబ్ యూనిట్ ఆఫీసర్‌లకు సూచించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ నిర్వహించిన పరీక్షల ఫలితాలను వైద్య సిబ్బంది కచ్చితంగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు, జిల్లాలోని అన్ని సబ్ యూనిట్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎఫ్‌ఎంఈ లబ్ధిదారులకు శిక్షణ




లబ్ధిదారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో సంఘటిత రంగంలోని పెద్ద వ్యాపారస్తులకు దీటుగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీ యూ.నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో పీఎంఎఫ్‌ఎంఈ లబ్ధిదారులు, డీఆర్పీలకు మార్కెటింగ్, బ్రాండింగ్, సాంకేతికత, ఫైనాన్స్ అంశాలపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో భాగంగా వ్యాపారాభివృద్ధికి అయ్యే వ్యయంలో 10 శాతం మాత్రమే లబ్ధిదారుడి వాటాగా ఉంటుందని, బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తూ, 35 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.కార్యక్రమంలో డీఆర్పీలుచరణ్,మద్దిలేటి, రవికుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై హర్షం

నంద్యాల(న్యూటౌన్): కేంద్రీయ విద్యాలయం నంద్యాల జిల్లాలోని డోన్‌లో ఏర్పాటుపై చేయడంపై వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి కర్నూలు జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించాలి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, వైద్యాధికారి షేక్.ఇమ్రాన్

చాగలమర్రి: గ్రామాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష సర్వేలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులందరికీ బీపీ, షుగర్‌తో పాటు 7 ప్రాథమిక వైద్య పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, వైద్యాధికారి షేక్.ఇమ్రాన్ సూచించారు. వారం రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళవారం మల్లెవేముల సచివాలయంలో ఏఎన్ఎం, సీహెచ్‌ఓ, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైద్య పరీక్షల ఫలితాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి, వారికి వైద్య సేవలు అందించటానికి అవసరమైన సమాచారంతో టోకన్లు అందజేయాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతి అందజేస్తున్న దాత

శిరివెళ్ల: ఇంటర్మీడియెట్ పరీక్షలలో ప్రతిభ కనపరిచిన యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేశారు. నంద్యాలకు చెందిన గోళ్ల నారాయణశ్రేష్ఠి ట్రస్ట్ ఒక్కొక్కరికి రూ. 1000 నగదు, ప్రోత్సాహక ప్రశంసా పత్రాలను ట్రస్ట్ అధ్యక్షుడు మురళీకృష్ణ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హద్దు రాళ్ల ఏర్పాటు



డి.వనిపెంట గ్రామంలో హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చాగలమర్రి: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా మండలంలో డి.వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలలో రీ సర్వే పూర్తి కాగా, రెవెన్యూ సిబ్బంది హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. డి.వనిపెంట రెవెన్యూ పరిధిలోని డి.కొత్తపల్లె, ఓ.జి.తాండా, చెంచూగూడెం గ్రామాలలో మొత్తం 1930 హద్దు రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 790 పూర్తయ్యాయని డీటీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముత్యాలపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎం.తాండా, చక్రవర్తులపల్లె, ముత్యాలపాడు గ్రామాలలో మొత్తం 3,435 హద్దు రాళ్లకు గాను 1700 ఏర్పాటు చేశామన్నారు. సర్వే సహయకులు రసూల్ గౌస్, బాషా, పద్మావతిలు ఎలక్ట్రానిక్ రోవర్‌ల సహయంతో ఏర్పాటు చేస్తున్నట్లు డీటీ తెలిపారు.

3,680 కుటుంబాల్లో సర్వే పూర్తి



మద్దూరులో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న సీహెచ్‌ఓ మహబూబ్‌హుసేన్



ఆర్.జంబులదిన్నెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి

చాగలమర్రి: మండలంలో గత 6 రోజులుగా 8 గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 3,680 కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించినట్లు చాగలమర్రి ప్రభుత్వ వైద్యాధికారి షేక్.ఇమ్రాన్ మంగళవారం తెలిపారు. ఆయా కుటుంబ సభ్యుల రక్త నమూనాలను సేకరించి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మల్లెవేముల – అక్టోబరు 3న, మద్దూరులో 4న, డి.వనిపెంట 5న, శెట్టివీడు 6న, పెద్దవంగలి-7న, చిన్నవంగలి-10న, చాగలమర్రి 1వ సచివాలయం- 11న, నెలంపాడులో 12వ తేదీ ఆయా సచివాలయాల వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సర్వేలో సీహెచ్‌ఓలు భాగ్యలక్ష్మి, మహబుబ్‌హుసేన్, వాణి, నర్మద, కవిత, శ్రీకాంత్, తేజశ్వని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీతో పాటు నర్సాపురం, ఆలమూరు పీహెచ్‌సీల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. వలంటీర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఆయా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీరంగాపురం,పెద్దకంబలూరు, చిన్నకంబలూరు గ్రామాల్లో సాగుతున్న సర్వేను డాక్టర్ ప్రసాదు, నర్సాపురం, తిప్పారెడ్డిపల్లెలో సాగుతున్న సర్వేను వైద్యుడు బాబు, చిత్రేనిపల్లె, మందలూరు, ముకుందాపురం గ్రామాల్లో సర్వేను డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి పరిశీలించారు.

సర్వే తనిఖీ

శిరివెళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మంగళవారం మండల ప్రభుత్వ వైద్యుడు విజయకుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతు మండలంలో 7 గ్రామసచివాలయాలలో సర్వే జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. మంగళవారం ఆర్.జంబులదిన్నె గ్రామంలో వైద్యాధికారిణి శివలింగమ్మ వైద్య పరీక్షలు నిర్వహించారు.

పొన్నాపురం గ్రామంలో నగర సంకీర్తన

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల మండలం పొన్నాపురం గ్రామంలో మంగళవారం నగర కన్వీనర్ చింతలపల్లె వాసు ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ఇంటింటికి కరపత్రాలను పంచుతూ హిందూ ధర్మం, సనాతన ధర్మం గురించి తెలియపరుస్తూ భజనలు, సంకీర్తనలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర సహ కన్వీనర్ రవికుమార్, రామనరసింహ, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, కృష్ణ, బాబురావు, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు సీఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని హోలీ క్రాస్ కెథడ్రల్ ఆలయంలో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టరేట్–2 సెక్రటరీ కిరణ్ కుమార్, ట్రెజరర్ బాలయ్య మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా 27వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉదయం 7 గంటలకు జెండావందనంతో ప్రారంభమై, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నంద్యాల డయాసిస్ అధ్యక్షురాలు బిషప్ పుష్పలలితమ్మ హాజరవుతారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించి అనంతరం 108 వెండి పుష్పాలచే ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, తిమ్మయ్య, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం

నంద్యాల టౌన్: నంద్యాల డిపో నుంచి నంద్యాల – రుద్రవరం మార్గంలో తిరిగే ఆర్టీసీ బస్సులలో గిఫ్ట్ స్కీం ప్రవేశపెడుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధరరావు మంగళవారం తెలిపారు. నంద్యాల నుంచి రుద్రవరం రూట్ లో ప్రయాణం చేసిన తరువాత ప్రయాణికులు తమ పేరు, చిరునామా, మొబైల్ నంబర్లను టికెట్ వెనుక రాసి బస్సులో ఉన్న గిఫ్ట్ స్కీం బాక్స్ నందు వెయ్యాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బాక్స్ తెరచి లక్కీ డిప్ ద్వారా గెలిచిన వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

రీ సర్వే త్వరగా పూర్తి చేయండి



రెవెన్యూ అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న జేసీ

రుద్రవరం: జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని టీ.లింగదిన్నెలో స్థానిక రెవెన్యూ సిబ్బంది ఇటీవలె రీ సర్వే పూర్తి చేశారు. కాగా సర్వే నంబర్ల వారీగా హద్దు రాళ్లు పాతే ప్రక్రియను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం ఆ గ్రామ పరిధిలో 700 పట్టాదారు పుస్తకాలు ఉన్నాయ న్నారు. ఇప్పటి వరకు 90 శాతం సర్వే, రాళ్లు పాతడం పూర్తి అయ్యిందని మిగిలిన పది శాతం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, వీఆర్వో నారాయణ తదితరులు ఉన్నారు.

స్పెషల్ శానిటేషన్‌పై దృష్టి సారించండి



ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): వార్డులలో స్పెషల్ శానిటేషన్ పనులపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా సుచించారు. మంగళవారం 6వ వార్డులో వార్డు కౌన్సిలర్ భీమునిపల్లె పురంధర్‌తో కలిసి పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ వారంలో మంగళవారం, గురువారం రెండు రోజులు పాటు పట్టణంలోని వార్డులలో పర్యటన చేసి శానిటేషన్, తాగునీరు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం అభా(అయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను) కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, వైఎస్సార్సీపీ నాయకుడు వెంకటసుబ్బయ్య, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, ఎంఈ రమణమూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు నివాళి

రుద్రవరం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం మేరీ మట్టీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన సమర యోధులు, భద్రతా దళాల ప్రముఖులకు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన మౌనిక (30) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన మౌనికను బీరవోలుకు చెందిన నరేష్‌తో పెద్దలు వివాహం చేశారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం. కొంత కాలంగా భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో వారి మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డిని సంప్రదించగా.. ఈఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, మృతురాలు తరపున ఎవరైనా ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.